# దేశీయ భాషల భావిగతి

* కొడవటిగంటి కుటుంబరావు *

మనం ఇంతకాలమూ ఇంగ్లీషు భాషద్వారా సంస్కారం సంపాదించాం. బోలెడంత ప్రపంచసాహిత్యం మనకు ఇంగ్లీషు ద్వారా అందుబాటులోకి వచ్చింది అనేక శాస్త్రవిషయాలూ, వార్తలూకూడా ఇంగ్లీషులోనే చదివి అర్థంచేసుకున్నాం మనమంతా ఆంగ్లమానసపుత్రులమైపోయినామని మన ముందుతరంవాళ్లు మనని ఎద్దేవా కూడా చేశారు ఇంగ్లీషుమాట దొర్లకుండా మనం అయిదునిమిషాలు పట్టుమని మాట్లాడలేం. మనం తెలుగులో రాయటానికి ప్రయత్నించినా ఇంగ్లీషు భాషా ధోరణి అందులోకి దిగుతుంది వీరేశలింగంగారివంటి తెలుగు పండితులకు సయితం ఇంగ్లీషుతనంతో కూడిన వాక్యధోరణి అప్పుడప్పుడు కలిగిందంటే సామాన్యులమాట చేప్పేదేమిటి?

ఈ పరిస్థితి మంచిదా చెడ్డదా అంటే దాన్నిగురించి ఇటూ అటూకూడా బోలెడంత వాదించవచ్చు ఇందులో కొంత మేలూ ఉంది, కొంతకీడూ ఉంది. కాని నేనావిషయం తర్కించబోను. ఇప్పుడు నేను చర్చించే సమస్య ఏమిటంటే, ఇంగ్లీషును మనం ఎంతోకాలం నమ్ముకోలేం. ఇప్పుడున్నస్థితిలో దేశీయభాషలు మన సంస్కారాన్ని ప్రతిఫలించలేవు ఈభాషలు చాలా సంస్కారం పొందాలి. ఈ సంస్కారం ఎట్లా జరుగుతుంది? దాని విషయంలో మన కర్తవ్యమేమిటి?

బొంబాయి పత్రికల్లో ఈ విషయం తర్జనభర్జనలు జరుగుతూ ఉన్నాయి. కొందరు "ఇంగ్లీషును మనం తక్షణం జారవిడవాలి" అనీ, మరి కొందరు "అది అసంభవం - మనభాషలు మన సంస్కారానికి తగ్గపరిణామం, పొందేవరకూ మనం ఇంగ్లీషును పోవిడువలేం," అనీ అంటున్నారు. నా బుద్ధికిఇద్దరివాదనలూ లోపభూయిష్ఠంగానే తోచాయి ఇంగ్లీషు విసర్జించినంతమాత్రంచేత దేశీయభాషలు సత్వరంగా అభివృద్ధి చెందుతాయని నేను నమ్మలేకుండా ఉన్నాను దేశీయభాషాలు వాటి ధర్మమా అంటూ అవి అభివృద్ధి అయిననాటికి మనం ఇంగ్లీషును వర్జింతామనుకోవటం చూస్తే, "ఈత వచ్చాకనే నీటిలో దిగుదాంలే" అన్నట్టున్నది.

ఈ సమస్యకి సరిఅయిన పరిష్కారమార్గం లేకపోలేదు అయితే అది ఒక్క తీర్మానంతోగాని, తీర్మానాన్ని శాశ్వతంగా వాయిదావెయ్యటంతోగాని జరిగేదికాదు

భాషలో జరిగే పరిణామం దానంతట అది జరగటంగాని, బలాత్కారంగా తెచ్చిపెట్టటంగాని అసంభవం సమర్థులైనవాళ్లు ఆధునిక ప్రయోజనాలకు భాషను వాడుతున్న కొద్దీ భాషకూడా ఆధునికమవుతుంది సాహిత్యమూ, రాజకీయప్రకటనలూ, ఉపన్యాసాలూ, సినిమాలూ మొదలైన వాటిద్వారా భాషకు ఉమ్మడి ఉపయోగం జరుగుతుంది.

ఇట్లా భాషను వుపయోగించి దానిలో పరిణామం తెచ్చేటప్పుడు, ఆభాషయొక్క పరిణతికి రెండురకాల అంతరాయాలు కలుగుతూవుంటాయి మొదటిది, దానికి పెద్దలు పెట్టే ఆంక్షలు. తెలుగుభాషకి అతిహేయ

మైన, అనర్థకమైన గ్రాంథిక భాషావాదం —అంటే కవిత్రయం వారి భాషలోనే గ్రంథమంతా నడవాలనే వాదం—ఒకటివుంది దీన్ని ఎవరూ పాటించటంలేదు గనక-అంటే విశ్వవిద్యాలయం మినహాగా ఎవరూ ఖాతరు చెయ్యటంలేదుగనక—తెలుగుభాష ఇవాళ ఈమాత్రం సజీవంగావుంది

రెండోవిషయం ఏమిటంటే, వెనకపడివున్న భాషను ఆధునిక ప్రయోజనాలకు వాడటంలో ఇతర అధునిక భాషల పోకడలు దీని కంటగడతారు అంటే ఇంగ్లీషు లాటి తెలుగు రాయట మనుకోండి

ఈ రెండూతప్పే ఇంగ్లీషు విద్య చదివిన మన యువకులకు తెలుగురాదనీ, తెలుగు చదవమనీ చెప్పుకోనటం గర్వం ఇందులో గర్వించటానికేమీ లేదు ఈ నాటి రచయితలు ఇంగ్లీషులాటిభాషల్లో ఉండే ఆధునికత్వం తెలుగులోకి తెస్తున్నారు ఇంగ్లీషుతప్ప చదవని యువకుల కా సంగతి తెలియదు

ఆ విధంగానే తెలుగులోరాసే యువకులకు "మాకు పాతగ్రంథాలుగురించి పరిచయంలేదు" అని చెప్పుకోవటంగర్వం వీరేఇంగ్లీషు తెలుగూ అపభ్రంశపు తెలుగూ రాస్తున్నది. తెలుగునుడికారమూ, తెలుగు జీవమూ తెలియాలంటే పాతసాహిత్యం చదివితీరాలి

మనం ఇంగ్లీషును బహిష్కరించనవసరంలేదు తెలుగుమీద ఆదరం పెంచుకుంటేచాలు దాన్ని అధునిక ప్రయోజనాలు అర్థించి ఉపయోగించటం పనిగా పెట్టుకుంటేచాలు. క్రమంగా అదే పరిణామం చెందుతుంది కాలక్రమాన ఇంగ్లీషుతప్పనిసరి అనే స్థితి దానంతట అదే అంతరిస్తుంది ఇంగ్లీషువల్ల ప్రయోజనం దానంతట అదే తరిగిపోవాలి, దేశభాషల వల్ల ప్రయోజనం పనిపెట్టుకుని సాధించాలి ఇదీ నా నమ్మకం.

ఆధునిక రచయితలు తెలుగుభాషలో అది వరలో జరిగిన పరిణామాన్ని పాటించకపోవటంచేత సామాన్యప్రజలకు ఈ భాష కృతకంగానూ విజాతీయంగానూ కనిపించటం జరుగుతున్నది దానివల్ల ప్రజాసామాన్యం ఆధునికత్వం పొందలేకుండా ఉన్నారు.

సంస్కారంగల యువకులు తెలుగు సాహిత్యాన్నీ భాషనూ అనాదరంతో చూడటంవల్ల వాళ్లకు ఇంగ్లీషు బొత్తిగా తప్పనిసరి అవుతూవుంది.

మన రచయితలు పాతసాహిత్యమూ, మనవిద్యార్థులు కొత్త సాహిత్యమూఆదరంతో చదివిననాడు ఈ సమస్య దానంతట అదే విడిపోతుందనటానికి సందేహంలేదు

ఇంగ్లీషు పత్రికలతోనూ, పుస్తకాలతోనూ దేశభాషల్లో వెలువడే పత్రికలూ పుస్తకాలూ, పోటీచెయ్యలేనంత కాలమూ మన భాషలకు మోక్షంలేదు ఇంగ్లీషులో పత్రికలు అచ్చుకాకూడదనీ, ఇంగ్లీషు పుస్తకాలు చాలాపరిమితంగా దిగుమతి కావాలనీ శాసనం చెయ్యటం ఒక్కక్షణం పని కాని దానివల్ల దేశభాషలు బాగుపడతాయనేది చాలా అనుమానాస్పదం అనేకమంది తెలుగు పెద్ద మనుషులను ఉపన్యాస వేదికలమీద "అయ్యా, తెలుగులో మాట్లాడండి," అని అడిగితే వారు తెలుగులో చెత్తగామాట్లాడటం మనం చూశాం ఇంగ్లీషును బలాత్కారంగా పంపిస్తే మనకుచెత్తే మిగులుతుంది ఇంగ్లీషు నమ్ముకున్నాకూడా మన భాషలు ఈ చెత్త స్థితిలోనే ఉంటాయి